క్లుప్తంగా

ప్లేట్లు, నోట్‌బుక్స్ వితరణ



ప్లేట్లు, నోట్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని కాగులపాడు గ్రామంలో ఉన్న ఎంపీపీ గిరిజన పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం భోజన ప్లేట్లు, పలకలు, నోట్‌బుక్స్, పెన్సిల్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఎంఈఓ ఎం.దిలీప్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సంస్థ చాలా మండలాల్లోని ప్రభుత్వ బడుల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన పాఠశాలల్లోని బాలబాలికలకు భోజన ప్లేట్లు, పలకలు తదితరాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు రోజూ పిల్లలను బడికి పంపాలన్నారు. పేద పిల్లలు చదువుకోవడానికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. సొసైటీ అధ్యక్షుడు ఎస్దానీ బాషా మాట్లాడుతూ తాము చేసే ప్రతి కార్యక్రమానికి దాతలు సహకారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సహాయం చేసిన దాతలు నవీన్, మౌలాలీ, ఖాజాకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ సభ్యులు పఠాన్ రహంతుల్లా, ఖాన్, సీఆర్పీ పి.మహేష్, హెచ్‌ఎం ఎస్వీ రమేష్, టీచర్ టి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పార్లపల్లిలో పీర్ల పండగ



పీర్లను ఏర్పాటు చేసిన దృశ్యం

పొదలకూరు: మండలంలోని పార్లపల్లిలో ముజావలీ షేక్ మహ్మద్ ఆధ్వర్యంలో పీర్ల పండగను నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. గ్రామంలో పీర్లను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామస్తులంతా హిందూ, ముస్లిం తేడా లేకుండా అగ్నిగుండ ప్రవేశం చేశారు. పీర్లను గ్రామంలో ఊరేగించారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు



ఆటో, క్యాబ్ యూనియన్ల నాయకులకు సూచనలిస్తున్న ఆర్టీఓ చందన

నెల్లూరు(టౌన్): రొట్టెల పండగ సందర్భంగా ప్రైవేట్ ట్రావెల్స్, ఆటోలు తదితర వాహనాల యజమానులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాంతీయ రవాణా శాఖాధికారి చందన తెలిపారు. గురువారం నగరంలోని జిల్లా రవాణా కార్యాలయంలో ఆటో యూనియన్, టాటా మ్యాజిక్ వాహనాల యూనియన్ నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి నెల్లూరు బస్టాండ్, రైల్వే స్టేషన్లకు వచ్చే ప్రయాణికుల వద్ద అధిక చార్జీలు వసూలు చేయరాదన్నారు. వాహన పరిమితికి మించి ప్రజలను ఎక్కించడం, మద్యం తాగి వాహనాలను నడపడం, మితిమీరిన వేగంతో వెళ్లడం లాంటివి చేయకూడదని తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంవీఐలు, ఏఎంవీఐలను ఆమె ఆదేశించారు. సమావేశంలో ఎంవీఐలు మురళీమోహన్, బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దర్గాకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా తీసుకెళ్లాలని ఎంవీఐ పవన్ కార్తీక్ తెలిపారు. వాహన ఫిట్‌నెస్ ప్రాంగణంలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు.

న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు(బృందావనం): పుట్టుకతోనే బాలలు కొన్ని ప్రాథమిక హక్కులను పొందడమే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం, దేశం పట్ల కొన్ని విధులు, బాధ్యతలను కలిగి ఉంటారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కె.వాణి తెలిపారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల వద్ద ఉన్న విశ్వభారతి అంధుల పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. అనంతరం భోజనం, వసతి, వైద్యసదుపాయాలు, ఆరోగ్య పరిస్థితులు తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కరస్పాండెంట్ పి.ప్రభావతమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులం చూడలేదు.. రాజకీయాలు చేయలేదు

- పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు
- కమ్మపాళెం గ్రామమే నిదర్శనం
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



చంద్రశేఖరపురంలో సైడ్ డ్రెయిన్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: 'సంక్షేమ పథకాల అమలులో కుల మతాలు చూడలేదు. రాజకీయాలు చేయలేదు. అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పథకాలను అందించారు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కమ్మపాళెం మజరా చంద్రశేఖరపురంలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలను వివరించడంతోపాటు సమస్యలడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రసన్న మాట్లాడుతూ వివిధ పథకాల రూపంలో కమ్మపాళెం గ్రామానికే రూ.16 కోట్లకు పైగా అందించినట్లు చెప్పారు. ఇక్కడ విభిన్నమైన రాజకీయాలు ఉన్నా అవేవీ చూడలేదన్నారు. సీఎం బటన్ నొక్కడంతో నేరుగా అర్హుల ఖాతాల్లో నగదు పడిందని తెలిపారు. ముఖ్యమంత్రి పారదర్శకంగా పథకాలందిస్తున్నారనేందుకు కమ్మపాళెం గ్రామాన్నే నిదర్శనంగా చెప్పొచ్చన్నారు. అన్నీ వర్గాలకు ప్రాధాన్యతనిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండాలని అందరూ కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే చొరవ

డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ గతంలో రాజకీయ స్వార్థంతో చంద్రశేఖరపురం పేదలకు సంజీవనగర్‌లో నివేశ స్థలాలిచ్చారని, అంత దూరం వెళ్లేందుకు గ్రామస్తులు ఇష్టపడలేదన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి కలెక్టర్‌ను సంప్రదించి చంద్రశేఖరపురంలోనే స్థలాలిచ్చేలా రంగం సిద్ధం చేశారని తెలిపారు. పంపిణీ కార్యక్రమం త్వరలో జరుగుతుందని, దీనికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చంద్రశేఖరపురంలో రూ.35 లక్షల జెడ్పీ నిధులతో సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓలు ఈ.రమాదేవి, పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ గాలి జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీటీసీ పేరం అరుణకుమారి, సర్పంచ్ చౌటూరు లక్ష్మయ్య, పంచాయతి కార్యదర్శి శివకుమార్, నాయకులు బెల్లం వెంకయ్యనాయుడు, బెల్లం వెంకట నగేష్‌నాయుడు, కొమ్మి రమేష్‌నాయుడు, నాపా రమేష్, కేతినేని హరికృష్ణ, పోసిన వెంకటేశ్వర్లు, షఫ్రక్ పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దు

- అమ్మవారి బంగారు పాదాలు పోలేదు
- జొన్నవాడ ప్రధానార్చకులు



బంగారు పాదాలను చూపుతున్న అర్చకులు, చైర్మన్

బుచ్చిరెడ్డిపాళెం: 'మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత ఆలయంపై అసత్య కథనాలు రాయడం తగదు. భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు.' అని ఆలయ ప్రధానార్చకులు నాటరాజస్వామి కోరారు. ఆలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ పత్రికలో అమ్మవారి బంగారు పాదాలు మాయం అంటూ కథనం వచ్చిందని, ఇది అవాస్తవమన్నారు. ఆలయ ప్రతిష్టను దెబ్బ తీయడంతోపాటు భక్తుల మనోభావాలను దెబ్బతీశారని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రోజూ ఆభరణాలు తీసి శుద్ధి చేసిన అనంతరం అమ్మవారికి తిరిగి అలంకరిస్తామన్నారు. ఆ సమయంలో బంగారు పాదాలు కూడా తీసి తిగిరి వేసినట్లు చెప్పారు. దీనిపై వాస్తవాలు తెలుసుకోకుండా అమ్మవారి పాదాలు మాయమయ్యాయని అవాస్తవాలు ప్రచారం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, పాలకమండలి సభ్యులు నందకుమార్ పాల్గొన్నారు.

రొట్టెల పండగకు పటిష్ట ఏర్పాట్లు

- రేపటి నుంచి ప్రారంభం
- రూ.3 కోట్లతో భక్తులకు సౌకర్యాలు



రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగ ఈనెల 29వ తేదీన ప్రారంభం కానుంది. ఐదురోజులపాటు జరిగే పండగకు వచ్చే భక్తుల కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డితోపాటు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అలాగే కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ దర్గా వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

రూ.3 కోట్లతో..

రొట్టెల పండగ ఏర్పాట్ల కోసం నగరపాలక సంస్థ రూ.3 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ పండగకు రాష్ట్రంలోని జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా భక్తులు రానున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నారు. దర్గా ప్రాంగణంలో 12 తాగునీటి స్టాల్స్ పెట్టారు. మరుగుదొడ్లు, వర్షం వస్తే తడవకుండా ప్రాంగణంలో షెడ్లపైన జింక్‌షీట్‌లు ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం ప్రత్యేకంగా ఓ విభాగాన్ని, పోలీస్ కంట్రోల్ విభాగాన్ని పెట్టారు. దర్గా ప్రాంగణంలో అధికారులు కేటాయించిన స్థలాల్లో ఇప్పటికే వందలాది దుకాణాలు ఏర్పాటయ్యాయి.

పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు 26 పార్కింగ్ స్థలాలను కేటాయించారు. వాటిల్లో కార్పొరేషన్ అధికారులు భక్తులకు ఇబ్బందుల్లేకుండా మగవారికి, ఆడవారికి వేర్వేరుగా మొబైల్ టాయిలెట్స్, స్నానపు గదులు, షవర్‌బాత్స్, బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, తాగునీటి వసతి ఏర్పాట్లు చేశారు. అంతే కాకుండా ఆయా పార్కింగ్ స్థలాల్లో విద్యుద్దీపాలు, సీసీ కెమెరాలను అమర్చారు. వాటిని పోలీస్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేశారు.

పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు

దర్గా ప్రాంగణంతోపాటు సమీప ప్రాంతాల్లో పారిశుద్ధ్యానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 28వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా కార్మికులను నియమించారు. మొత్తం ఏడు జోన్లుగా విభజించి ఆయా జోన్లలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు, రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టులలో సంబంధిత సిబ్బంది పనిచేసేలా ప్రణాళికలు రూపొందించారు. పారిశుద్ధ్యం నిర్వహణకు 4,908 మంది సిబ్బందిని నియమించారు.

ప్రభుత్వ శాఖల అనుమతులతోనే పనులు

- ఉపాధి హామీ క్యూసీ ఈఈ వేణుగోపాల్



మాట్లాడుతున్న వేణుగోపాల్

పొదలకూరు: చెరువులు, కాలువలు, రోడ్లు పనులను ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో చేపట్టాలంటే విధిగా ఆయా ప్రభుత్వ శాఖల అధికారుల అనుమతులు తీసుకోవాలని ఉపాధి హామీ క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నెల్లూరు క్లస్టర్ పరిధిలోని ఏడు మండలాల ఈసీలు, టీఏలు, ఏపీఎంలకు ఈఈ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు పనులు చేయాలంటే జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. లేకుంటే ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో చేసిన పనులు జరగలేదనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి పనులు చేపట్టినా పక్కాగా రికార్డులు ఉండాలని సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా అవకతవకలకు పాల్పడితే సంబంధిత టీఏ, ఎఫ్‌ఏలకు రికవరీ వస్తుందని హెచ్చరించారు. టీఏలు పనులపై అవగాహన పెంపొందించుకోవాలని, ఎంబుక్ రికార్డు చేసే సమయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసే సందర్భంగా రికార్డు చేసిన పనులు క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. కందకాల నిర్మాణానికి ఉపాధి హామీలో అనుమతులు ఉన్నట్లు తెలిపారు. చెరువు కట్ట పనుల నిర్వహణ గురించి ఈఈ వివరించారు. సమావేశంలో ఏపీడీ శ్రీహరిరెడ్డి, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సీహెచ్ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఇందుకూరుపేట: ఎంపీపీ గంధళ్ల శంకరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కోవూరు: టీటీడీ ఆధ్వర్యంలో మండలంలోని ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించారు. కథ చెబుతారా అనే అంశంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి, నాయకులు మీరారెడ్డి, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, రాజగోపాల్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



ముత్తుకూరు: స్థానిక వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. నారికేళపల్లి పంచాయతీలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్లో మొత్తం 40 మందికి వాటిని అందజేశారు. హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

బాబా మందిరంలో పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకి సేవ నిర్వహించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

డయల్ యువర్ డీఎం నేడు

నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ డీఎం–1 పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం–1 మురళీకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

'జగనన్న సురక్ష' విజయవంతం



ముత్తుకూరు: ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు, నాయకులు (ఫైల్)

వెంకటాచలం: 'ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది విజయవంతంగా జరుగుతోంది.' అని మండల జేసీఎస్ కన్వీనర్ మందల వెంకటశేషయ్య అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని సర్వేపల్లిలో లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించి అండగా నిలిచిందన్నారు. వివిధ కారణాలతో ధ్రువీకరణ పత్రాల్లేక కొంతమందికి పథకాలు అందకపోవడాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వసుమతి, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రమేష్, సచివాలయ కన్వీనర్ ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ కుంచి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు వెళ్లి..

పొదలకూరు: లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సర్టిఫికెట్లను వలంటీర్ల ద్వారా అందజేస్తున్నట్లు తహసీల్దార్ కె.వీరవసంతరావు తెలిపారు. మండలంలోని తోడేరు సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష క్యాంప్‌ను తహసీల్దార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రూపాయి ఖర్చులేకుండా సర్టిఫికెట్లను అందిస్తున్నట్లు వెల్లడించారు. సచివాలయ పరిధిలో 482 సర్టిఫికెట్లను ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, ఏఓ ఎ.వాసు, తోడేరు, అయ్యగారిపాళెం, నందివాయ సర్పంచ్‌లు అలుపూరు పెంచలమ్మ, కండే వసంతమ్మ, కలికి ప్రమీలమ్మ, వీఆర్వో జి.పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం

ముత్తుకూరు: జగనన్న సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరమని ఎంపీపీ గండవరం సుగుణ, ఎంపీడీఓ ప్రత్యూష అన్నారు. మండలంలోని తాళ్లపూడి సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా పోయిందన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా అవసరమైన పత్రాలు ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. 607 సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మామిడిపూడి సర్పంచ్ మస్తానమ్మ, పద్మనాభరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేవిస్‌పేటలో..

ఇందుకూరుపేట: మండలంలోని దేవిస్‌పేటలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఇందులో ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రజలు సర్టిఫికెట్ల కోసం వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వేగంగా ఇస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఎంతో ఉపయోగం

కోవూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని డీఈఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కోవూరు ఐదో సచివాలయంలో గురువారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ పార్వతి, తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి, పార్టీ మండలాధ్యక్షుడు నరసింహులరెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



కోవూరు: మాట్లాడుతున్న నాయకులు



విడవలూరులో..

విడవలూరులో..

మండల కేంద్రంలోని సచివాలయం–1 పరిధిలో ప్రజలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ అచ్యుతరెడ్డి, ఎంపీపీ భవానమ్మ, మండల సచివాలయ కన్వీనర్ వేణుకుమార్‌రెడ్డి, నాయకులు శ్రీహరిరెడ్డి, విడవలూరు సొసైటీ చైర్మన్ ప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు లబ్ధి

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల ప్రజలు ఎంతో లబ్ధి చేకూరుతోందని తహసీల్దార్ సుధీర్ అన్నారు. మండలంలోని దామరమడుగులో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య కల్యాణ మండపంలో గురువారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెంచలశ్యామ్, వ్యవసాయాధికారి సురేందర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చర్ల సతీష్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వెంకటాచలం : లబ్ధిదారుకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న వైస్ ఎంపీపీ, జేసీఎస్ మండల కన్వీనర్



పొదలకూరు: సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



ఇందుకూరుపేట: సర్టిఫికెట్ అందజేస్తున్న విజయ్‌కుమార్



బుచ్చిరెడ్డిపాళెంలో..

రేపటి నుంచి 12వ విడత గడప గడపకు..

బుచ్చిరెడ్డిపాళెం: ఈ నెల 29వ తేదీ నుంచి కోవూరు నియోజకవర్గంలో 12వ విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 7 గంటల నుంచి బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, కోవూరు మండలాల్లోని ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం నుంచి ప్రజలు పొందిన లబ్ధిని వివరించడంతోపాటు సమస్యలను తెలుసుకుంటామన్నారు.

బుచ్చిరెడ్డిపాళెంలో..

ఈ నెల 29, 31వ తేదీల్లో బుచ్చి టౌన్‌లోని 14, 15 వార్డులు, ఆగస్టు 7వ తేదీన మండలంలోని పల్లాప్రోలు, హరిజనవాడ, అరుంధతీవాడ, గొల్లపాళెం, పోలినాయుడు చెరువు, 8న వడ్డిపాళెం, సాలిపాళెం, గిరిజన కాలనీ, 11న బుచ్చి టౌన్‌లోని 12వ వార్డు, 12న 13వ వార్డు, 14న 18వ వార్డు, 20న 2వ వార్డు, 24న 19వ వార్డు, 25న 20వ వార్డు, 26న 16వ వార్డు, 27న 17వ వార్డుల్లో పర్యటిస్తారు.

కోవూరులో..

ఆగస్టు 3, 4, 5, 9, 10 తేదీల్లో కోవూరు టౌన్‌లో పర్యటిస్తారు.

ఇందుకూరుపేటలో..

ఆగస్టు 17, 18, 19, 21, 22వ తేదీల్లో మండలంలోని మైపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

నేడు జూనియర్ కళాశాలల బంద్

పొదలకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల బంద్‌ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఎం.అశోక్‌రెడ్డి తెలిపారు. గురువారం పొదలకూరులో ఆయన బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కళాశాలల యాజమాన్యాలు బంద్‌కు సహకరించాలని కోరారు.

తిరుమలకు మహా పాదయాత్ర

పొదలకూరు: మండలంలోని బిరదవోలు గ్రామానికి చెందిన 80 మంది భక్తులు వరుసగా ఏడో పర్యాయం కాలినడకన తిరుమలకు గురువారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ముందుగా నిమ్మ మార్కెట్ యార్డు వినాయక స్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అయ్యప్పనగర్ శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. ఆలయం నుంచి మహా పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.